
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం, 5, జూన్, 2025



సోమశిలలో 41.430 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 41.430 టీఎంసీలు ఉన్నాయి. 346 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 3,180, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,520
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,090
3 శాతం జీఎస్టీతో	రూ.9,363
సవర (8 గ్రా)	రూ.74,904

గరిష్టం/కనిష్టం
39.6 /29.8

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉండి అక్కడకక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 55 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

సచివాలయ రెవెన్యూ అడ్మిన్‌కు అరెస్ట్ వారెంట్

నెల్లూరు (లీగల్): నెల్లూరు రాజేంద్రనగర్‌లోని కుక్కలగుంట 41/1 సచివాలయ రెవెన్యూ అడ్మిన్ షేక్ మెహరున్నీసాకు చెల్లని చెక్కు కేసులో రెండో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్. శారదరెడ్డి బుధవారం నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెపై 2023లో చెల్లని చెక్కుకు సంబంధించి కోర్టులో కేసు దాఖలైంది. కోర్టు నుంచి సమన్లు అందుకుని విచారణకు రాకపోవడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తదుపరి కేసు విచారణ జూలై 18వ తేదీకి వాయిదా వేశారు

హౌసింగ్ ఏఈపై విచారణ



ఏఈ కరిముల్లాను విచారిస్తున్న హౌసింగ్ అధికారులు

సీతారామపురం: మండల హౌసింగ్ ఏఈ కరిముల్లా పనితీరుపై బుధవారం ఈఈ మోహన్‌రావు, డీఈ పీరాన్ విచారణ చేపట్టారు. ఏఈ కరిముల్లా కొంతకాలంగా విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ గోదాములోని సిమెంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా బయటకు తరలించారన్న ఆరోపణలు రావడంతో హౌసింగ్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సిమెంట్ గోదామును తనిఖీ చేసి రికార్డుల ప్రకారం 1,056 బస్తాలు ఉండాల్సి ఉండగా, కేవలం 24 బస్తాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. మిగతా వాటికి లెక్కలు చూపించాలని కోరగా ఆయన పొంతన లేని సమాధానాలు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుది నివేదికను హౌసింగ్ ఉన్నతాధికారులకు అందించి ఏఈ కరిముల్లాపై శాఖాపరమైన చర్యలు చేపడుతామన్నారు.

టీడీపీలోకి దగదర్తి ఎంపీపీ, జెడ్పీటీసీ

దగదర్తి: వైఎస్సార్‌సీపీకి చెందిన దగదర్తి ఎంపీపీ తాళ్లూరి వెంకట కృష్ణప్రసాద్ నాయుడు, ఆయన సతీమణి జెడ్పీటీసీ సభ్యురాలు తాళ్లూరి స్వరూపరాణి బుధవారం విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వీరి వెంట కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, దగదర్తి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కేసు నమోదు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ పార్టీ కార్యకర్త ఖాజా ర్యాలీ సమయంలో బాణసంచా కాల్చిన నేపథ్యంలో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వనమహోత్సవం

నెల్లూరు (అర్బన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నెల్లూరు సమీపంలోని నగరవనంలో నిర్వహిస్తున్నామని డీఎఫ్‌ఓ కె.మహబూబ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. పర్యావరణ ప్రేమికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని కోరారు.

రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ 2025 పరీక్షలు ఈ నెల 6వ తేదీ నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 31,221 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి 90 నిమిషాల ముందే అనుమతిస్తామన్నారు. కేంద్రంలోకి కాల్యుకులేటర్, చేతి గడియారాలు, సెల్‌ఫోన్లు, హ్యాండ్ బ్యాగులు తదితర వాటిని అనుమతించమని తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. వివరాలు.. ఎన్టీఆర్‌నగర్ మూడు జెండాల సెంటర్‌కు చెందిన కర్తం అవినాష్‌పై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఉంది. ఆయన తరచూ నేరాలకు పాల్పడుతుండటంతో కలెక్టర్ అనుమతితో పీడీ యాక్ట్‌ను పోలీస్ అధికారులు నమోదు చేశారు. గత నెల 30న ఆయన్ను కడప కేంద్ర కారాగారానికి తరలించారు.



వెంకటాచలం ర్యాలీలో పాల్గొన్న ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, కాకాణి పూజిత



నెల్లూరు రూరల్ నియోజకవర్గం ర్యాలీలో ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి



కావలి: ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వెన్నుపోటుపై రణన్నినాదం

కూటమి వంచన పాలనపై జిల్లాలో 'జన' భేరి

- ఊరూవాడాల నుంచి పెల్లుబికిన ప్రజాగ్రహం
- మండుటెండలోనూ ఎక్కడికక్కడ భారీ ర్యాలీలు
- నెల్లూరుసిటీ, సర్వేపల్లిలో పోలీసుల ఓవరాక్షన్
- సర్వేపల్లిలో ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి
- కోవూరు, నెల్లూరులో నల్లచొక్కాలతో నేతల నిరసన
- కోవూరులో ఎండీయూ వాహనాల ర్యాలీ



కూటమి ఏడాది వెన్నుపోటు పాలనపై సింహపురి.. జనభేరి మోగించింది. అసమర్థ ప్రభుత్వాన్ని దించే వరకు విశ్రమించబోమని రణన్నినాదం చేసింది. ఊరూవాడాల్లో పెల్లుబుకిన ప్రజాగ్రహం.. ఉద్యమ కెరటమై గర్జించింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో ప్రజలు మండుటెండను సైతం లెక్క చేయకుండా పాల్గొని అధికార పార్టీ వెన్నులో వణుకు పుట్టించారు. కొన్ని చోట్ల పోలీసులు ర్యాలీలకు ఆటంకాలు సృష్టించారు. సర్వేపల్లిలో అయితే ఏకంగా తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న ఎంపీలనే అడ్డుకున్నారు. ప్రచార రథం డ్రైవర్‌ను బెదిరించి ముందుకు కదలనీయకుండా ఆపేశారు. కోవూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో వినూత్నంగా నల్లబెలూన్లతో భారీ సంఖ్యలో ఎండీయూ వాహనాలు, కూటమి హామీల మోసాలపై ప్లకార్డుల బాక్స్‌లతో నిరసన ర్యాలీల్లో పాల్గొన్నారు.

–సాక్షి ప్రతినిధి, నెల్లూరు



నెల్లూరు నగరంలో ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీ

ఈ ప్రజాగ్రహం ట్రైలర్ మాత్రమే



కోవూరులో భారీ ర్యాలీలో ప్రసన్న, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

- ఈవీఎంల ప్రభుత్వాన్ని గద్దె దించి తీరుతాం
- చంద్రబాబు అసమర్థ పాలకుడు
- పవన్‌కళ్యాణ్ ఉన్మాది రాజకీయ నేత
- మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఈవీఎంలతో గద్దె ఎక్కిన చంద్రబాబు ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దించి తీరుతామని, ఏడాదిలోనే ప్రజల నుంచి వచ్చిన ఆగ్రహం ట్రైలర్ మాత్రమే అని రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఏడాది పాలన అంతా కుట్రలు, కుతంత్రాలతోనే పూర్తయిందని విమర్శించారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజలు వెన్నుపోటు పొడిచిన కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కోవూరులో 'వెన్నుపోటు దినం' దిక్కులు పిక్కటిల్లేలా నిర్వహించారు. అనంతరం మీడియాతో ప్రసన్న మాట్లాడారు. ఏడాది కాలంలో ఒక్క పథకం కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. సిగ్గులేని ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు వస్తుందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. దళితులు, మహిళలు, ఆడబిడ్డలకు రక్షణ కరువైందన్నారు. ప్రతి హామీని నెరవేర్చేలా కూటమి ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు.

పవన్ కళ్యాణ్.. చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయ్

డీసీఎంగా పవన్‌కళ్యాణ్ ప్రజలకు చేసిందేమీ లేదని, గత ఎన్నికల ప్రచార సమయంలో 30 వేల మంది మహిళలను వలంటీర్లు కిడ్నాప్ చేశారని తప్పుడు ప్రచారం చేశారని, ఏడాదైనా వారిని తిరిగి రప్పించలేకపోయాడని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కాపు ఉద్యమ కారులపై అక్రమ కేసులు బనాయిస్తే ఆ సమస్యలపైన పోరాడాల్సింది పోయి కూటమి ప్రభుత్వానికి వంత పాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వీరి చలపతిరావు, రాధాకృష్ణారెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, అనూప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, శ్రీనివాసులురెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శేషగిరిరావు, సతీష్‌రెడ్డి, షాహుల్, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, దినేష్‌రెడ్డి, అహమ్మద్ తదితరులు ఉన్నారు.

మోసం చేయడంలో దిట్ట

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలకు మంగళం పాడుతూ ఏడాదిలోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత చంద్రబాబు దక్కించుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బాబు మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఏడాదిలోనే ఆయన నిజస్వరూపం తెలుసుకున్నారని, దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. వీటి గురించి ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్‌లు చేస్తున్నారని, ప్రజలు చంద్రబాబుకు త్వరలోనే సరైన బుద్ధి చెబుతారని అన్నారు.

నమ్మించి నట్టేట ముంచాడు

- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): ఏడాది కూటమి పాలన అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు, దగా, దౌర్జన్యాలతో సాగిందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కావలి పట్టణంలో వెన్నుపోటు దినం కార్యక్రమం జరిగింది. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల నిరసన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఆయన నివాసం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలను నమ్మించి నట్టేట ముంచిందన్నారు. బాబును నమ్మిన ప్రజలకు కన్నీటి కష్టాలే మిగిలాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ అరెస్టులు చేస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరిని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తునే ఉంటుందని తెలిపారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు

- బుర్రా మధుసూదన్‌యాదవ్

కందుకూరు: వెన్నుపోటుకు సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. వెన్నుపోటు దినాన్ని పురస్కరించుకొని బుధవారం కందుకూరులో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో వివరించారు. ఎన్నికల్లో ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఏ పల్లెకు, గ్రామానికి, వార్డుకు వెళ్లినా చంద్రబాబునాయుడు నమ్మించి మోసం చేశారంటూ ప్రజలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలనపై ప్రశ్నిస్తున్నందుకే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు ప్రభుత్వం పెడుతుందని బుర్రా అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన పాలన ఎప్పుడూ చూడలేదని, ఎంతో మంది నియంతలు సైతం కనుమరుగైన విషయాన్ని ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటూ సబ్‌కలెక్టర్ తిరుమాణి శ్రీపూజకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్‌తో పాటు, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజలకే పంగనామాలు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (అర్బన్): ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. ఆ ప్రజలకే వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందని నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరు నగరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం 'వెన్నుపోటు దినం' నిర్వహించారు. వీఆర్‌సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏఓ విజయకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దొంగ హామీలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలను అటకెక్కించారన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి నేతలు ఖలీల్ అహ్మద్, అంజాహుస్సేని, మొయిళ్లగౌరి, సురేష్, సమీర్‌ఖాన్, అబ్దుల్ మస్తాన్, సిద్ధిఖ్, నేతాజీ సుబ్బారెడ్డి, మజ్జిగ జయకృష్ణారెడ్డి, ఊటుకూరు నాగార్జున, అశ్రిత్ రెడ్డి, చీదెళ్ల కిషన్, కొణిదెల సుధీర్, కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వంచన ఆయన నైజం

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: బిడ్డనిచ్చిన సొంత మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం పెద్ద లెక్క కాదని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలో బుధవారం పార్టీ జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో జనాన్ని బోల్తా కొట్టించి అధికారంలోకి వచ్చారు. ఏడాది అయినా ఒక్క హామీ అమలు చేయలేదు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను హించిస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పిందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



ఆత్మకూరులో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు



కందుకూరు పట్టణంలో వెన్నుపోటు దినం ర్యాలీ



ఉదయగిరి ట్యాంక్ బండ్‌పై ర్యాలీ చేస్తున్న పార్టీ నేతలు

క్లుప్తంగా

ఉద్యోగులకు సేవలందించేందుకు సిద్ధం

- రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ



మాట్లాడుతున్న శాంతిప్రియ

నెల్లూరు రూరల్: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సేవలందించేందుకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ తెలిపారు. బుధవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక అదాలత్ నిర్వహించారు. 55 మందికి పెన్షన్ మంజూరు పత్రాలు, 15 మందికి జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలను నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పెన్షన్ ప్రతిపాదనల మంజూరు ప్రక్రియ ఏజీ కార్యాలయంలో ఏవిధంగా జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపాదనలను పంపే సమయంలో దరఖాస్తుతోపాటు ఏ పత్రాలను జతపరచాలో విధిగా తెలుసుకోవాలన్నారు. వచ్చే నెల నుంచి విద్యాశాఖతో మొదలుపెట్టి క్రమంగా అన్ని శాఖల్లోని ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే పీపీఓలను అందజేస్తామన్నారు. ఇందుకోసం ప్రతి ఉద్యోగి నేరుగా తానే ఆన్‌లైన్‌లో దరఖాస్తును పూరించి అవసరమైన పత్రాలను జతచేసి డీడీఓలకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ సర్వీస్ పూర్తి చేసి పెన్షన్ మంజూరు కోసం రాష్ట్ర కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏజీ కార్యాలయం వారు నేరుగా జిల్లాలకు కదిలి రావడం ఉద్యోగుల అదృష్టమన్నారు. డీఆర్వో ఉదయభాస్కర్ మాట్లాడుతూ పెన్షన్ ప్రతిపాదనలను పంపే సమయంలో ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిశోర్‌రెడ్డి, వారి కార్యాలయ అధికారులు విజయ్‌కుమార్, భవాని ప్రసాద్, సునీత, కార్యక్రమ నోడల్ అధికారి, డీటీఓ గంగాద్రి, డీసీఓ గురప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, డీపీఆర్‌ఓ సదారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు తిక్కన పార్కు సమీపంలోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి నెల్లూరు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. చనిపోయి రెండు, మూడు రోజులై ఉండొచ్చని తెలుస్తోంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

అనుమసముద్రంపేట: మండలంలోని జువ్వలగుంటపల్లిలో పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సైదులు గురువారం తెలిపారు. ఆరుగురు జూదరులను పట్టుకున్నామన్నారు. రూ.1,60,890ల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముదురుతున్న కుల సర్టిఫికెట్ వివాదం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో కులం సర్టిఫికెట్ మంజూరులో నెలకొన్న వివాదం ముదురుతోంది. ఇటీవల స్థలం విషయమై రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఇరువురిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. రెండు వర్గాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా వారికి సర్టిఫికెట్ల మంజూరులో రెవెన్యూ అధికారులు జాప్యం చేశారు. ఈ క్రమంలో ఓ వర్గం వారు నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆ వర్గం వారికి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. మరో వర్గానికి చెందిన వారు బుధవారం టీడీపీ నేతలతో కలిసి రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమకు ఎందుకు సర్టిఫికెట్ మంజూరు చేయలేదో చెప్పాలని తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌ను నిలదీశారు.

ఆర్టీసీ డిపోలో పరిశీలన

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ డిపో, ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పరిశీలించారు. గ్యారేజీని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బస్టాండ్‌ను ఆధునికీకరించి మొక్కలు నాటాలని సూచించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మూతపడిన డక్కిలి బస్టాండ్‌ను, వినియోగంలో లేని బాలాయపల్లి బస్టాండ్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

నేరస్తుల కదలికలపై నిఘా : ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు, సస్పెక్టెడ్, కేడీ, డీసీల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ గది తదితరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్, కేడీ, డీసీలు ఎంతమంది ఉన్నారు?, ఏం చేస్తున్నారు?, వారిలో ఎంతమంది యాక్టివ్‌గా ఉన్నారు? తదితర వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, కేసుల పెండెన్సీని తగ్గించేందుకు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. దొంగతనాల కట్టడికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కేసుల్లో విచారణ వేగవంతం చేసి నిందితులను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేయాలన్నారు. గొలుసు దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట నగర డీఎస్పీ పి.సింధుప్రియ, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

పకడ్బందీగా మెగా డీఎస్సీ పరీక్షలు

- 8 కేంద్రాల ఏర్పాటు
- 31,221 మంది అభ్యర్థులు
- సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు రూరల్: జిల్లాలో మెగా డీఎస్సీ – 2025 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాల్లో 31,221మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వైద్యశిబిరాలను పెట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు అభ్యర్థులు సమయానికి చేరుకునేలా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలన్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

డీఎస్సీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు సందేహాలుంటే 62817 04160, 81219 47387, 81250 46997, 93988 10958, 79956 49286, 79957 89286, 99630 69286, 70138 37359 ఫోన్ నంబర్లను సంప్రదించాలని డీఈఓ బాలాజీరావు తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం వద్ద గల డిజిటల్ జోన్, కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు నగరంలోని ముత్తుకూరు రోడ్డులో ఉన్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ, ఎన్‌బీకేఆర్ సైన్స్, ఆర్ట్స్ కళాశాలలు, గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని చెప్పారు. నిర్దిష్ట సమయానికి కంటే గంట ముందు అభ్యర్థులను లోనికి అనుమతిస్తామని, నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. సమావేశంలో విద్యుత్, వైద్యం, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

- జిల్లాలో 5 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: ఈనెల 5వ తేదీన జరిగే వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యమన్నారు. బుధవారం ఉదయం అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కొత్తూరు సమీపంలోని నగర వనంలో ఘనంగా నిర్వహించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. అన్ని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి నుంచి మొక్కలను సేకరించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, నెల్లూరు సిటీ, మున్సిపాలిటీల్లోని పార్కుల్లో, పారిశ్రామికవాడల్లో, ఖాళీ స్థలాల్లో, రైతుల భూముల్లో విరివిగా నాటాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు.

7న యోగా ర్యాలీలు

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 7వ తేదీన ప్రతి వార్డు, గ్రామ స్థాయిలో యోగా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇది 10 లక్షలకు చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో యోగా పోటీలు నిర్వహించాలని సూచించారు.

కండలేరులో 39.668 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 39.668 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,875, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- పది వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ శివరామకృష్ణారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

మనుబోలు: చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీ కోసం మోటార్‌బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మనుబోలు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. మనుబోలు మండలం పిడూరుపాళెం గ్రామానికి చెందిన యల్లంటి మౌళి కృష్ణ, కావలి రూరల్ మండలం బుడంగుంట గ్రామానికి చెందిన ఎస్‌కే కరిముల్లా చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. నేరాలు చేస్తూ వేర్వేరు కేసుల్లో జైలుకు వెళ్లారు. అక్కడ స్నేహితులుగా మారారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాక ఈజీ మనీకి అలవాటుపడి బైక్‌లు దొంగతనం ప్రారంభించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మనుబోలుతోపాటు కొడవలూరు, విడవలూరు, గూడూరు తదితర ప్రదేశాల్లో పార్కింగ్ చేసి ఉన్న పది వాహనాలను మారు తాళాలతో చోరీ చేశారు. మంగళవారం రాత్రి మనుబోలు హైవేపై ఎస్సై శివరాకేష్ వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతున్న వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం విషయం బయటపడింది. దీంతో బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వాహనాల విలువ సుమారు రూ.3.60 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో చొరవ చూపిన ఎస్సైతోపాటు ఏఎస్సై తిరుపాల్, సిబ్బంది మాధవరావు, వేణు, ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు, సురేష్, మణి తదితరులను సీఐ అభినందించారు.

నగదు తీసుకెళ్తుండగా..

- చోరీ చేసిన వ్యక్తి
- పట్టుకుని దేహశుద్ధి చేసిన జనం



నగదు తీసుకెళ్లిన అశోక్

పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు బంగారు నగలను బ్యాంక్‌లో కుదువ పెట్టి నగదు తీసుకెళ్తుండగా తస్కరించిన వైనం పొదలకూరు బస్టాండ్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రైతు వరికూటి రామకృష్ణారెడ్డి బ్యాంక్‌లో బంగారు నగలను కుదువ పెట్టి వ్యవసాయ అవసరాల కోసం రూ.86 వేలు తీసుకున్నాడు. బ్యాంక్‌లో నగదు తీసుకుంటున్న సమయం నుంచే ఓ యువకుడు గమనించినట్టుగా తెలుస్తోంది. రైతు తన బైక్ ట్యాంక్ కవర్లో నగదు కవర్‌ను పెట్టి మధ్యాహ్నం హోటల్లో భోజనం చేశాడు. ఆ సమయంలోనే ముంబై ప్రాంతానికి చెందిన అశోక్ అనే యువకుడు నగదును తస్కరించే యత్నం చేశాడు. అక్కడ వీలుపడకపోవడంతో రామకృష్ణారెడ్డి బస్టాండ్‌లో అరటిపండ్లు కొనుగోలు చేస్తున్న సమయంలో నగదు కవర్‌ను యువకుడు తస్కరించి పరిగెత్తాడు. వెంటనే తేరుకున్న రైతు బైక్‌పై వెంబడించి స్థానిక సినిమా హాలు ఎదురు సందులో అతడిని పట్టుకున్నాడు. రైతుకు బాసటగా నిలిచిన స్థానిక వ్యాపారులు అశోక్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. అయితే తెలుగు మాట్లాడలేని ఆ యువకుడు తస్కరించిన నగదును మరో యువకుడికి అందజేసి సినీ ఫక్కీలో దాటించినట్టుగా చెప్పుకొంటున్నారు. పోలీసులు అశోక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తన తల్లితో ప్లాస్టిక్ సామగ్రి అమ్ముకునేందుకు వచ్చానని అతను చెప్పాడని, అయితే పట్టణంలో అతడికి సంబంధించిన వారు ఎవరూ లేనట్టు సమాచారం. ఆ యువకుడు వద్ద చాకు, ఇతర మారణాయుధాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్సై ఎస్‌కే హనీఫ్ పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు.

హైవేపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

- తగులబడిన మరో ట్యాంకర్



దగ్ధమైన ట్యాంకర్

మర్రిపాడు: మండలంలోని కంద్రిక సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ కంద్రిక సమీపంలో బోల్తా పడింది. వెనుకనే వస్తున్న సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్ ప్రమాదాన్ని చూశాడు. వాహనాన్ని ఆపి ఘటనా స్థలానికి వెళ్లాడు. ఈ క్రమంలో మరో సిమెంట్ ట్యాంకర్ ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఢీకొన్న ట్యాంకర్ కాలిపోయింది. మొత్తంగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటల్ని ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.24
పండ్లు : రూ.10



పట్టణ ప్రజలపై ఇంటి పన్నుల భారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలపై ఇంటి పన్నుల భారం మోపారు. అయితే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు మాత్రం నెరవేర్చలేపోయారు' అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు, పట్టణ నివాస ప్రాంతాల సమన్వయ కమిటీ కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణ ప్రజలపై 20 శాతం ఇంటి పన్నులు పెంచటంతోపాటు, విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి పీక్ అవర్స్‌లో అదనపు చార్జీలు వేస్తోందన్నారు. ఇంటి పన్ను విధానాన్ని గతంలోలా రెంటల్ పద్ధతిలో అమలు చేయాలని చూస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం 'స్మార్ట్ మీటర్లు వద్దు.. కరెంట్ చార్జీలు తగ్గించాలి' స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింహపురి పౌరసమాఖ్య నగర కార్యదర్శి అత్తిమూరు శ్రీనివాసులు, నాయకులు సూర్యనారాయణ, ఆసిఫ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్లను ఆవిష్కరించిన నేతలు

చౌటుప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- గాయపడిన వారిలో జిల్లా వాసులు



దెబ్బతిన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు భాగం

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ సమీపంలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి శివాంజలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 34 మంది ప్రయాణికులతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్నట్రాలీ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా జిరుగుమల్లి మండలం చిర్రిపాడు గ్రామానికి చెందిన డ్రైవర్ కొండల్‌రావు (42) బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం పరుచూరివారిపాళెం గ్రామానికి చెందిన దండిబోమిన గోవిందమ్మ (47)కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. ప్రయాణికుల్లో 18 మందికి గాయాలయ్యాయి. వారిలో కందుకూరుకు చెందిన యనమల మమత, లింగసముద్రం మండలం తూమగుంట గ్రామానికి చెందిన మీటినేని విజయ, ఉలవపాడు మండలం రామాయపట్నానికి చెందిన అప్పనగిరి సురేష్, అప్పనగిరి జ్యోతి ఉన్నారు. బస్సు ప్రమాద సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో నిమ్మలో అధిక దిగుబడి

సైదాపురం: నిమ్మలో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే పెరియవరం శాస్త్రవేత్త డాక్టర్ డి.తిరుపాల్ తెలిపారు. మండలంలోని కొమ్మిపాడు గ్రామంలో బుధవారం వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నిమ్మ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొదలకూరు ఉద్యాన శాఖాధికారి ఆనంద్ ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను రైతులకు వివరించారు. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు కురుస్తున్నందున పండ్ల ఈగ విజృంభిస్తోందని, దాని నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు షేక్ హసీనాభాను, సిబ్బంది మదన్, స్వప్న, బాలరాజరావు తదితరులు పాల్గొన్నారు.